
# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



**సోమశిలలో 23.119 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 23.119 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వ్యవసాయానికి 3350 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.64,500 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,792 |
| 3శాతం జీఎస్టీతో | రూ.5,966 |
| నవర (8గ్రా) | రూ.47,728 |

గరిష్టం/కనిష్టం
32.5 /24.6

**వాతావరణం**

శుక్రవారం గాలిలో తేమ 80 శాతం ఉంది. ఎండతీవ్రత క్రమంగా పెరుగుతోంది. శనివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

### న్యూస్‌రీల్

## త్వరితగతిన పనులు పూర్తి చేయించండి

• కలెక్టర్ హరినారాయణన్



పరిశ్రమ నిర్మాణ పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

**వెంకటాచలం:** హజారే రెడీమేడ్ గార్మెంట్ పరిశ్రమ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా నిర్మాణమవుతున్న హజారే రెడీమేడ్ గార్మెంట్ పరిశ్రమ నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పెండింగ్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, విద్యుత్ పనులను రేపటి నుంచి ప్రారంభించి, మెషినరీ పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశ్రమ వల్ల సుమారు 200 మంది వస్త్రాలు తయారు చేసే కళాకారులు ఉపాధి పొందుతారని నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సుధాకర్, ఐపీఓ శామ్యూల్, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

## 13న జెడ్పీ సమావేశం

**నెల్లూరు(పొగతోట):** జిల్లా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో 2023-24 సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నట్లు తెలిపారు. జెడ్పీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని తెలిపారు.

# ఆశలు చిగురించెనే..



### నెరవేరనున్న మెట్ట ప్రాంతవాసుల కల

- తుది అంకంలో నడికుడి–శ్రీకాళహస్తి రెండో దశ రైల్వే లైన్ పనులు
- కేంద్ర బడ్జెట్‌లో రూ.450 కోట్ల కేటాయింపు
- భూసేకరణ పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం



పిడుగురాళ్ల వద్ద నిర్మించిన నూతన రైల్వే లైన్ (ఫైల్)

**ఆత్మకూరు:** పలు జిల్లాల్లోని మెట్ట ప్రాంత మండలాలను కలుపుతూ నిర్మిస్తున్న నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు తిరిగి ప్రారంభంకానున్నాయి. ఈ రైల్వే లైన్ నిర్మాణం ద్వారా మెట్ట ప్రాంతవాసుల 60 ఏళ్ల కల సాకారం కానుంది. ఇప్పటికే కార్యరూపం దాల్చినప్పటికీ మధ్యలో కొన్ని అవాంతరాలు, కేంద్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో తగినంత కేటాయింపులు చేయకపోవడం తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. అయితే ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గానికి రూ.450 కోట్లు కేటాయించడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. వాస్తవానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మెట్ట ప్రాంతాల మీదుగా హైదరాబాదు నుంచి తిరుపతికి రైల్వే లైన్ నిర్మించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు పూర్తి సహకారం అందిస్తుందని 2008-09 లోనే కేంద్రానికి ప్రతిపాదన పంపారు. అప్పట్లో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం కావడానికే ఆలస్యమైంది. 2009లో వైఎస్సార్ అకాల మరణంతో ఈ ప్రాజెక్ట్ గురించి పట్టించుకోలేదు. ఎట్టకేలకు 2011-12 సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ నూతన రైల్వే లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే ఈ ప్రాజెక్ట్‌ను ఐదేళ్ల కాల వ్యవధిలో పూర్తి చేయాలని సంకల్పించింది. అయితే అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూసేకరణ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహించడం తదితర కారణాలతో నత్తనడకలా సాగింది.

**భూసేకరణ పూర్తి**

ఈ రైల్వేలైన్ నిర్మాణం కోసం మొత్తం 5,189 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆలస్యమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక భూసేకరణను పూర్తి చేసింది. కేవలం కొన్ని గ్రామాల పరిధిలో మాత్రమే భూసేకరణ విషయమై కోర్టులో కేసులు జరుగుతున్నాయి. 2016లో పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ రైల్వే లైన్ పనులు అనేక అవాంతరాలతో నత్తనడకన సాగగా, ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్చల ద్వారా 2026 నాటికి పూర్తి చేసేలా ఒప్పందం కుదిరింది. ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతంలో రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా గుండ్లకమ్మ నది మీద పెద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు సైతం తుది దశకు చేరుకున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు, రాపూరు, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల మీదుగా ఈ రైల్వే లైన్ నిర్మాణం జరగనుంది. అందులో భాగంగా ఈ మార్గంలో 15 నూతన రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నట్లు అధికారులు తెలిపారు.

**ఎంతో ఉపయోగం**

తొలుత ఈ రైల్వే మార్గంలో గూడ్స్ రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. అనంతరం పాసింజర్ రైళ్లు కూడా అంచలంచెలుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా ప్రయాణ దూరం, ఆర్థిక భారం రెండూ తగ్గనున్నాయి. అంతేకాకుండా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు, వాణిజ్యపరంగా అభివృద్ధి జరిగేందుకు ఈ నూతన రైలు మార్గం ఎంతో దోహదపడనుంది.

### వందలాది గ్రామాల మీదుగా..

గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా నిర్మిస్తున్న ఈ రైలు మార్గంతో వందలాది గ్రామాలకు ఎంతో మేలు చేకూరనుంది. అదే క్రమంలో ఈ ప్రాంతాల్లో రైతులు పండించే పొగాకు, మిర్చి, పత్తి, వివిధ రకాల పండ్లు తదితర వ్యవసాయ ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు ఈ రైల్వే మార్గం ఎంతో ఉపయుక్తం కానుంది. మొత్తం 309 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ రైల్వే మార్గంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 38 నూతన రైల్వే స్టేషన్లు ఏర్పాటయ్యేలా డిజైన్లు రూపొందించారు. కాగా ఈ రైల్వే లైన్ పనులకు సంబంధించి గుంటూరు జిల్లా నడికుడి - పిడుగురాళ్ల మధ్య జరుగుతున్న రెండో దశ పనులు తుది అంకానికి చేరుకున్నాయి. ప్రస్తుతం మంజూరైన బడ్జెట్ నిధులతో పనులు పూర్తయి మూడో దశ పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే భూసేకరణ జరిగిన ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనులు వేగవంతం కానున్నాయి.



నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ ప్రాజెక్ట్ మ్యాప్ (ఎరుపు రంగులో ఉండేది)

**ఇన్నేళ్లకు నెరవేరుతోంది**



మా చిన్న వయసు నుంచి ఆత్మకూరు మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తారని చెప్పడం వింటున్నా. ఆత్మకూరు మీదుగా రైల్వే లైన్ నిర్మాణం జరగనుండడం సంతోషంగా ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భూసేకరణ, నిధులు మంజూరు చేయడంలో చొరవ తీసుకోవడం ద్వారా ఈ పనులు వేగవంతం కానున్నాయి.

– జీవీ నారాయణరావు, విశ్రాంత హెచ్‌ఎం, ఆత్మకూరు

**ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది**



ఆత్మకూరు మీదుగా జాతీయ రహదారులు ఉన్నాయి. రైల్వే లైన్ లేకపోవడం లోటుగా ఉండేది. ఎప్పటి నుంచో ఊరిస్తున్న రైల్వే లైన్ నిర్మాణ పనులు కొంతమేర జరిగాయని విన్నా. ఇప్పుడు మంజూరైన బడ్జెట్‌తో పనులు జరుగుతాయని ఆశిస్తున్నా. తద్వారా ఈ ప్రాంతవాసుల కల నెరవేరడంతోపాటు ఆత్మకూరు అభివృద్ధి చెందుతుంది.

– ఇంటూరు నారాయణ, విశ్రాంత సూపరింటెండెంట్, ఎంపీడీఓ కార్యాలయం, ఆత్మకూరు

## 'నారాయణ'లో తనిఖీలు



నారాయణ ఆస్పత్రి గేటు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు :** నెల్లూరు నగరం చింతారెడ్డిపాలెంలోని నారాయణ వైద్య కళాశాల క్యాంపస్‌లో నిషేధిత మందుల విక్రయాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు బలగాలతో కలిసి ఔషధ నియంత్రణాధికారులు శుక్రవారం తనిఖీలు జరిపారు. తొలుత డ్రగ్స్ అధికారులు నారాయణ వైద్య కళాశాల, డెంటల్ కళాశాలకు మధ్య ఉన్న డూప్లెక్స్ భవనంలో సోదాలు జరిపారు. ఆ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న కొంతమంది విద్యార్థులు మత్తు మందులు వాడుతూ వాటికి బానిస అవుతున్నారంటూ వారి తల్లిదండ్రులు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. సోదాల్లో ఔషధ నియంత్రణశాఖ అధికారులు పాల్గొన్నారు.



కారు డిక్కీలో తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

## స్వామిత్వను పూర్తి చేయండి

• డీపీఓ సుస్మితారెడ్డి

**నెల్లూరు(పొగతోట):** స్వామిత్వ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి మండలస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి వివిధ మండలాల ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## క్లుప్తంగా

### ఎన్నికల నోడల్ అధికారులకు శిక్షణ




అవగాహన కల్పిస్తున్న బాపిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు గానూ మాస్టర్ ట్రెయినర్లకు మంచి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి బాపిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి.. వ్యయం తదితర అంశాలపై నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో రెండు రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ప్రవర్తన నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని చెప్పారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినర్లు కింది స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు చేసే ఖర్చుల వివరాల నమోదుపై జిల్లా సహకార శాఖ అధికారి తిరుపతయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 140 |
| లేయర్ (లైవ్) | : 85 |
| బ్రాయిలర్ చికెన్ | : 248 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 274 |
| లేయర్ చికెన్ | : 145 |

### పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | : రూ.63 |
| సన్నవి | : రూ.50 |
| పండ్లు | : రూ.25 |

# సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలో సాగునీటికి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పెద్ద చెరువు నుంచి రెండో తూము ద్వారా పొలాలకు సాగునీరు వెళ్లే కాలువ పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉండటంతో తన సొంత నిధులతో వీటిని తొలగించే పనులను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రెండో నంబర్ తూము వద్ద గేట్లెత్తడంలో సమస్య వచ్చిందని, చెరువులో నీరు ఉండటంతో మరమ్మతులు చేయడం సాధ్యపడలేదన్నారు. కావలి రూరల్, బోగోలు మండలాల్లో సాగునీటి సమస్య తలెత్తితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో



కావలి చెరువు వద్ద గేట్లను పరిశీలిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

మాట్లాడి సోమశిల జలాలను అందించేలా చూస్తామన్నారు.

# పోర్టు నిర్వాసితులకు న్యాయం చేస్తాం

గుడ్లూరు: రామాయపట్నం పోర్టుతో నిర్వాసితులైన మండలంలోని కర్లపాళెం గ్రామస్తులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. గుడ్లూరు మండలం మొండివారిపాళెం వద్ద నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టు వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని వెంటనే చెల్లించాలని పోర్టు వద్ద నిరసన తెలుపుతున్న కర్లపాళెం గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. ఇళ్ల స్థలాలను తర్వాత కేటాయించినా ముందుగా ఒక్కో కుటుంబానికి చెల్లించాల్సిన రూ.9.90 లక్షల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని వెంటనే అందజేసేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. ఇళ్ల స్థలాలివ్వకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని చెల్లించడం కుదరదని, తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.లక్షను ఇస్తామని, మిగిలిన నగదును వారం ,పది రోజుల్లో జమ చేస్తారని ఆమె తెలిపారు. అయితే ప్యాకేజీ మొత్తాన్ని ఒకేసారి జమ చేసినప్పుడే నిరసన కార్యక్ర



కర్లపాళెం గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ విద్యాధరి

మాన్ని విరమిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. రామాయపట్నం పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మయ్య, పోర్టు అభివృద్ధి కమిటీ సభ్యుడు నక్కల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 13న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్

నెల్లూరు (టౌన్): జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనను ఈ నెల 13 నుంచి నిర్వహించనున్నామని నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో గల జెడ్పీ హైస్కూల్లో సన్నాహక సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇన్‌స్పైర్ మనక్‌ను పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లా స్థాయికి 154 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, కార్యక్రమ విజయవంతానికి డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులతో 18 కమిటీలను నియమించామని తెలిపారు. ఎంపికైన ప్రాజెక్టుల



మాట్లాడుతున్న ప్రసన్నలక్ష్మి

విద్యార్థులు, గైడ్ టీచర్లు 13వ తేదీ ఉదయం ఏడు గంటలకు జెడ్పీ హైస్కూల్‌కు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకొని, వారికి కేటాయించిన స్టాళ్లలో ప్రదర్శించాలని కోరారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడారు. విద్యార్థులు వారి ప్రాజెక్టుకు సంబంధించిన మూడు హార్డ్ కాపీలు, ఒక సాఫ్ట్ కాపీని సీడీ లేదా పెన్ డ్రైవ్‌లో ప్రొఫార్మాతో నింపి తీసుకురావాలని కోరారు. కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓలు మురళీధర్, భిక్షాలు, అబ్దుల్ హమీద్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్): వ్యక్తిగత కక్షతో ఒకర్ని హత్య చేశారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో జలదంకి మండలం చామదలకు చెందిన పండంటి శీనుకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తేజోవతి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. చామదలకు చెందిన శీను, మొద్దు నాగార్జున స్నేహితులు. వీరు మద్యం సేవించి తిరిగేవారు. ఈ నేపథ్యంలో శీను బంధువు పోలయ్యపై నాగార్జున దాడి చేశారు. అప్పటి నుంచి నాగార్జునపై కక్ష పెంచుకున్న నిందితుడు శీను అవకాశం కోసం ఎదురుచూడసాగారు. 2019, ఆగస్టు 22న రాత్రి పది గంటల ప్రాంతంలో నాగార్జునను శీను బ్రాహ్మణక్రాక వద్ద గల పెట్రోల్ బంకు వెనుక ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ఇద్దరూ మద్యం సేవించారు. మత్తులో ఉన్న నాగార్జున తలపై ఇనుపరాడ్డుతో కొట్టి హత్య చేశారు. నాగార్జున తండ్రి మాల్యాద్రి ఫిర్యాదు మేరకు జలదంకి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం శీనుపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి స్పెషల్ పీపీ నారాయణ కేసు వాదించారు.

**లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు..**

ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో తోటపల్లిగూడూరు మండలం వరిగొండకు చెందిన పంచాక్షరి మల్లికార్జునకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానాను విధిస్తూ నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. జంగాలకండ్రికలోని ఓ కళాశాలలో క్యాంటీన్‌ను నిందితుడు మల్లికార్జున నిర్వహించేవారు. అదే ప్రాంతంలో ఓ కుటుంబం నివసించేది. ఈ క్రమంలో 2018, జూన్ పదో తేదీ మధ్యాహ్నం తల్లిదండ్రుల్లేని సమయంలో ఆ ఇంట్లోని బాలికకు మాయమాటలు చెప్పి క్యాంటీన్ వెనుక వైపునకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజారెడ్డి వాదించారు.

## డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు – 1, 2 డిపోలకు సంబంధించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని మేనేజర్లు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డిపో – 1కు సంబంధించి సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు 99592 25641 నంబర్‌కు.. రెండో డిపోకు గానూ మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంటలోపు 99592 25642కు నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

## లారీ ఢీకొని వాహనచోదకుడి మృతి

వెంకటాచలం: లారీ ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వెంకటగిరికి చెందిన వెంకటకృష్ణయ్య (27) పని నిమిత్తం బైక్‌పై నెల్లూరు బయల్దేరారు. ఈ క్రమంలో పెట్రోల్ పట్టించుకునేందుకు రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా, గూడూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటకృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జాబ్ మేళా నేడు

కందుకూరు: స్థానిక ఉప్పుచెరువు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ మస్తానయ్య తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. జాబ్‌మేళా ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరగనుందని చెప్పారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు హాజరై ఉద్యోగావకాశాలను కల్పించనున్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిప్లొమా, ఐటీఐ కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. ఆధార్‌కార్డు,



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట తదితరులు

దరఖాస్తు ఫారాన్ని తీసుకురావాలని, వివరాలకు 95505 95228, 79896 68732 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



విశేషంగా తరలివచ్చిన భక్తులు



బెల్లాన్ని బావిలో సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో తై అమావాస్య

నెల్లూరు(బృందావనం): తై అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని వేమాలశెట్టి బావి ప్రాంగణంలో గల వైద్య వీరరాఘవస్వామి దేవస్థానంలో విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. కోర్కెలు తీరాలని కాంక్షిస్తూ ఉప్పు, మిరియాలు సమర్పించే వారు.. కోర్కెలు తీరిన వారు వేమాలశెట్టిబావిలో బెల్లం సమర్పించేందుకు విశేషంగా తరలివచ్చారు. వైద్య వీరరాఘవస్వామి, వేమాలమ్మ, వేమాలయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవస్థాన ప్రాంగణంలో కొలువైన పరివార దేవతామూర్తులను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

## 15లోపు ఈ - కేవైసీ పూర్తి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వివిధ పంటలకు సంబంధించిన ఈ – కేవైసీని ఈ నెల 15లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ – కేవైసీ నమోదులో వెనుకబడి ఉన్నామని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండే సమయాల్లో సిబ్బంది వెళ్లి పూర్తి చేయాలని కోరారు.